క్లుప్తంగా

ప్రశంసాపత్రం అందజేత



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : మండలంలోని నక్కలపల్లి గ్రామ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ఉపాధ్యాయురాలు ఉమకు తెలంగాణ స్కూల్ ఇన్విటేషన్ ఛాలెంజ్–2022–23 కార్యక్రమంలో భాగంగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈద మాధవి నర్సింహ, ఉప సర్పంచ్ సైదులు, బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి బాష పాక రవికుమార్, సత్తయ్య తదితరులున్నారు.

నేడు కేసీఆర్ జన్మదిన వేడుకలు

నల్లగొండ టూటౌన్ : ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా నల్లగొండ పట్టణం వీటీ కాలనీలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం 680 మందితో రక్తదాన శిబిరం, కేక్ కట్ చేసే కార్యక్రమం నిర్వహించనున్నట్లు నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో ప్రతి వార్డుకు, గ్రామానికి 10 మంది చొప్పున కార్యకర్తలు హాజరై రక్తదానం చేయాలని కోరారు.

23 లోపు దరఖాస్తు చేసుకోవాలి

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు లేని పేదలు డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చిట్యాల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను మహిళల పేరుతో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను జతచేసి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందజేయాలని సూచించారు.

బీజేపీ ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్



కట్టంగూర్ : బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పామనగుండ్ల గ్రామానికి చెందిన కారంపూడి సాయికుమార్‌ను నియమిస్తూ పార్టీ మండల అధ్యక్షుడు నూకల సుధాకర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ మండలంలో బీజేపీని బలోపేతం చేసేందుకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ ప్రయాణికుల సలహాలు సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నల్లగొండ ఆర్టీసీ డీఎం రాం మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 8688195070 నంబర్‌కు ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలని కోరారు.

నేడు ఫుట్‌బాల్ పోటీలు

నల్లగొండ టూటౌన్ : ఎన్జీ కళాశాల మైదానంలో వైఆర్పీ ఫౌండేషన్, ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బీచ్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ కోచ్ కరుణాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 జట్ల మధ్య నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మెడల్స్, షీల్డ్‌లను అందజేస్తారని తెలిపారు.

కేతేపల్లి తహసీల్దార్‌గా మధుసూదన్‌రెడ్డి



కేతేపల్లి : కేతేపల్లి తహసీల్దార్‌గా ఎస్.మధుసూదన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటేశ్వర్లు గట్టుప్పల మండలానికి బదిలీ అయ్యారు. రాష్ట్ర సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డిని అధికారులు కేతేపల్లి తహసీల్దారుగా బదిలీ చేశారు.

విద్యార్థులకు స్నాక్స్ ఏర్పాటు

చిట్యాల : పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం సమయంలో స్నాక్స్ కోసం ఐదు వేల రూపాయల నగదును బీజేపీ రాష్ట్ర నాయకుడు శేపూరి రవీందర్ గురువారం ఆ పాఠశాల హెచ్ఎం గోగికార్ మాధవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచే విద్యార్థులకు పదివేల పదహారు రూపాయలు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పోల్లేపల్లి సత్యనారాయణ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లపు బుద్ధుడు, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీను పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ప్రాంగణాల' నిర్మాణం

- ఉమ్మడి చండూరు మండలంలో 18 క్రీడా ప్రాంగణాల నిర్మాణం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



గట్టుప్పల మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం

చండూరు : గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దాదాపు క్రీడా మైదానాల ఎంపిక పూర్తికావొచ్చింది. చండూరు, గట్టుప్పల మండలాల పరిధిలోని అనేక గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తికాగా మరికొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి.

18 గ్రామాల్లో పూర్తి

గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె క్రీడా ప్రాంగణాలు యువతకు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయి. గతంలో గ్రామాల్లో క్రీడలు ఆడేందుకు స్థలం లేకపోవడంతో యువకులు మైదానాలు ఉన్న గ్రామాలకు వెళ్లి ఆడుకునేవారు. ప్రస్తుతం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి చండూరు మండలం పరిధిలో 23 గ్రామ పంచాయతీల్లో సుమారు 18 గ్రామాలు బంగారిగడ్డ, దోనిపాముల, గట్టుప్పల, కస్తాల, పడమటితాళ్ళ, పుల్లెంల, శిర్దేపల్లి, తుమ్మలపల్లి, గుండ్రపల్లి, కొండాపురం, జోగిగూడెం, తిమ్మారెడ్డిగూడెం, శేరిగూడెం, బోడంగిపర్తి, చామలపల్లి, తేరట్‌పల్లి, గొల్లగూడెంలలో ప్రాంగణాల ఏర్పాటు పూర్తయ్యింది. ఇడికూడ, కమ్మగూడెం, నెర్మట, తాస్కానిగూడెం, చొప్పరివారిగూడెం గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

క్రీడా కోర్టులు ఏర్పాటు

గ్రామాల్లో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాల్లో వాలీబాల్, కబడ్డీ, లాంగ్ జంప్, హైజంప్ తదితర క్రీడలకు సంబంధించిన కోర్టులను ఏర్పాటు చేశారు. ఈ క్రీడా ప్రాంగణాల్లో ఎవరికివారే క్రీడలను నిర్వహించుకోవాల్సి ఉంటుంది.

ఉపయోగకరంగా ఉన్నాయి



రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు యువకులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ఈ ప్రాంగణాలు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి. గతంలో గ్రామంలో క్రీడా మైదానం లేక ఇబ్బంది పడేవారు. గట్టుప్పలలో ప్రాంగణం ఏర్పాటైన తర్వాత అనేక క్రీడలు నిర్వహించుకుంటున్నాం.

–ఇడెం రోజా, సర్పంచ్, గట్టుప్పల

అన్ని గ్రామాల్లో అందుబాటులోకి తెస్తాం



మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తెస్తాం. ఇప్పటికే 18 గ్రామాల్లో ప్రాంగణాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. మరి కొన్ని గ్రామాల్లో పూర్తి కావాల్సి ఉంది. పల్లెల్లో ప్రభుత్వ స్థలాలు లేక ఆలస్యం జరుగుతోంది. ప్రాంగణాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

–యాకూబ్ నాయక్, ఎంపీడీఓ

సంపూర్ణ అంధత్వ నిర్మూలనకు కృషి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నకిరేకల్ : గొల్లగూడెంలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : సంపూర్ణ అంధత్వ నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ మండలం గొల్లగూడెంలో గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ చూపు కోల్పోతున్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు క్యాక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల సోమన్న, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్, వైద్యాధికారి యోగస్వీ, హెచ్ఈఓ రాపోలు రవి, ఎంపీటీసీ బోయిళ్ల కిశోర్, సామ శ్రీనివాస్‌రెడ్డి, కందాల భిక్షంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా గొల్లగూడెం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ శ్రీదేవిగంగాధర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కోటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : మండలంలోని చిట్టంపహడ్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆ గ్రామ సర్పంచ్ అబ్బనబోయిన చందుయాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇక్బాల్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాత ఎలక్ట్రానిక్ వస్తువుల సేకరణ



వస్తువులు సేకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజులుగా సేకరించిన పాత ఎలక్ట్రానిక్ వస్తువులను గురువారం డీసీఎం ద్వారా రీసైక్లింగ్‌కు హైదరాబాద్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ లయన్ తీగల మోహన్‌రావు మాట్లాడుతూ చెడిపోయిన ఎలక్ట్రానిక్ వస్తులను రీసైక్లింగ్ చేయడం ద్వారా ట్రీ గార్డులను తయారు చేయించి మొక్కల పెంపకం కోసం ఉపయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోలి అమరేందర్‌రెడ్డి, నేతి రఘుపతి, శివశంకర్‌రావు, సింహాద్రి, సతీష్‌కుమార్, సంజీవరెడ్డి, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, నాగమణి రెడ్డి, మురళీధర్‌రెడ్డి, సురేష్‌గుప్త పాల్గొన్నారు.

మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నల్లగొండలో మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

నల్లగొండ టూటౌన్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ఆర్. ప్రదీప్‌కుమార్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. గురువారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏవిధంగా మోసం చేస్తోందో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో వివరంగా చెప్పాలని కోరారు. హామీలు అమలు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజలను మభ్యపెడుతూ కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రదీప్‌కుమార్ ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, దాసోజు యాదగిరాచారి, పాలకూరి రవిగౌడ్, దాయం భూపాల్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, నాగం వర్షిత్ రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం

మునుగోడు : ఉప ఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్ ఆరోపించారు. ప్రజా గోస.. బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా గురువారం మునుగోడులో నిర్వహించిన శక్తి కేంద్ర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు అనేక హామీలు ఇచ్చి వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలను బీజేపీ నాయకులు ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమ నియోజకవర్గ కో కన్వీనర్ వేదాంతం గోపీనాథ్, భవనం మధుసూదన్‌రెడ్డి, బూడిద లింగయ్యయాదవ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ పందుల భాస్కర్, నాయకులు బీసం గంగరాజు, శ్రీశైలం, జిట్టగోని యాదగిరి, సాగర్ల లింగస్వామి, పందుల నర్సింహ, బీసం విజయ్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు



శాలిగౌరారం : ఇటుకులపహాడ్‌లో బొడ్రాయివద్ద పూజలు చేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నకిరేకల్ : పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



శాలిగౌరారం : ఇటుకులపహాడ్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్



కేతేపల్లి : చెర్కుపల్లిలో కోలాటం వేస్తున్న మహిళలు

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామం శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభం, నంది విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీలింగారావు, సర్పంచ్ బొల్లెద్దు నాగమణిఅంబేద్కర్, ఎంపీటీసీ కొత్తపల్లి సిరివెన్నెలఈదయ్య, గోదోరిగూడెం ఎంపీటీసీ ఊట్కూరు సందీప్‌రెడ్డి, కందుల లక్ష్మయ్య, వనపర్తి నాగేశ్వరరావు, గుర్రం వెంకట్‌రెడ్డి, సురేందర్, రఘు, డానియెల్, బొల్లెద్దు వెంకన్న, చెన్నకేశవులు, నవీన్, కొత్తపల్లి సైదులు, మారగోని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి : మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో నూతన నిర్మించిన శ్రీశంభులింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో భాగంగా వేదపండితులు పగిడిమర్రి శ్రీనివాస్‌శర్మ బృందం ఆధ్వర్యంలో గురువారం గణపతిపూజ, పుణ్యావాహచనం, దీక్ష ధారణ, అఖండ దీపారాధన, యాగశాలాప్రవేశం, అగ్ని పథనం తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆవరణలో దంపతులు యజ్ఞాలు, హోమాలు నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలకు పాలు, తేనె, నీళ్లు, నెయ్యి, పుష్పాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సాయంత్రం వేళ డప్పుచప్పుళ్లు, మేళతాళాల మధ్య విగ్రహాలను గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామస్తులు నీళ్లారబోసి, కొబ్బరికాయలు కొట్టి, పసుపు, కుంకుమలు, నవధాన్యాలు సమర్పించుకున్నారు.

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని మూసీ రోడ్డులో ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు విశ్వబ్రాహ్మణులు భారీగా తరలివచ్చారు. శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ శ్రీకాంత్‌చారి, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్, ఆలయ చైర్మన్ కంచర్ల బ్రహ్మచారి, సంకోజు నర్సయ్య, సంకోజు హరి, విశ్వదళ్ అధ్యక్షుడు నరేంద్రాచారి, బ్రహ్మచారి, సంకోజు రామకోటి, ఆకారవరం సత్యనారాయణ, ఓంకారం పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన, శివాలయ ప్రారంభం

శాలిగౌరారం : మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపన, శివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆయా పార్టీల నాయకులు పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు. గ్రామానికి చెందిన యంగలి రాంబాబు, రామకృష్ణ కుటుంబీకులు సుమారు 3 వేల మందికి ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టి జానయ్య తదితరులు ఉన్నారు.

భద్రాద్రి రాముడికి తలంబ్రాల బియ్యం తయారీ



చిట్యాలలో తలంబ్రాల బియ్యం తయారు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

చిట్యాల : శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవానికి చిట్యాల పట్టణంలోని శివాలయంలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మహిళలు గురువారం తలంబ్రాల బియ్యం తయారు చేశారు. వడ్లను చేతితో వలిచి తలంబ్రాల బియ్యం తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ బియ్యాన్ని భద్రాచలం ఆలయ కమిటీకి అందజేసేందుకు పంపించినట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు తేరటుపల్లి హన్మంతు, పట్టణ అధ్యక్షుడు వాస విద్యాసాగర్, మహిళా సంఘం అధ్యక్షురాలు బెలిదె నర్మద, ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యదర్శి రంగా వెంకటేశ్వర్లు, యువజన విభాగం మండల అధ్యక్షుడు కలకుంట్ల రవి, పోలా నవీన్, వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు వనమా హైమా అరుంధతి, వనమా మౌనిక, పోల సరిత, బుద్ధ విమల పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



మెటీరియల్ అందజేస్తున్న చరణ్

నల్లగొండ రూరల్ : పేద విద్యార్థులకు అండగా కస్తూరి ఫౌండేషన్ ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ అన్నారు. నల్లగొండ మండలంలోని కంచనపల్లి, అప్పాజీపేట, కాజీరామారం, ముశంపల్లి, పెద్దసూరారం, ఎం దుప్పలపల్లి హైస్కూళ్లలో చదివే పదో తరగతి విద్యార్థులకు గురువారం చరణ్ స్టడీ మెటీరియల్ అందజేసి మాట్లాడారు. మహేష్, నరేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం పరిధిలో గల ఇందుర్తి శ్రీ శంభులింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుంభం వెంకట్‌రెడ్డి, సలహాదారుడు చెరుకు లింగంగౌడ్ గురువారం తెలిపారు. ఈ నెల 17న గణపతి పూజ, జ్యోతిర్లింగాల పూజ, 18న స్వామివారి కల్యాణం, అనంతరం అన్నదానం, 19న అభిషేకాలు, ఆశీర్వచనం నిర్వహిస్తారని తెలిపారు.

వీగిన అవిశ్వాసం

మునుగోడు : మండలంలోని కొంపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌పై అవిశ్వాసం వీగిపోయింది. 15 రోజుల క్రితం ఆ గ్రామ పంచాయతీలోని 8 మంది వార్డు సభ్యులు అవిశ్వాసాన్ని కోరుతూ నల్లగొండ ఆర్డీఓ జయచంద్రారెడ్డికి వినతి పత్రం అందించారు. మొత్తం 10 మంది వార్డు సభ్యులతోపాటు సర్పంచ్ కూడా అవిశ్వాస సమావేశానికి గ్రామపంచాయతీలో గురువారం హాజరుకావాలని ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు. అయితే సమావేశానికి కేవలం నలుగురు వార్డు సభ్యులు మాత్రమే హాజరై మిగిలిన ఆరుగురు సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో అవిశ్వాసానికి సరిపడా కోరం లేనందున వీగిపోయినట్లు ఆర్డీఓ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జానయ్య, తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీఓ సుమలత, సర్పంచ్ జాల వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



రశీదు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని పాతబస్తీలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి నాగం మల్టీ స్పెషాలిటీ చైర్మన్ బీజేపీ నాయకుడు డాక్టర్ వర్షిత్‌రెడ్డి–సాహిత్య దంపతులు గురువారం రూ. 11,11,116 విరాళంగా ప్రకటించారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు గార్లపాటి వెంకటయ్య, ఇటికాల కృష్ణయ్య, నూరిగిళ్ల యాదగిరిల సమక్షంలో విరాళాన్ని ఇస్తామని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, కస్పరాజు వెంకన్న, బాకీ నరసింహ, ఆవుల మధు, గడ్డం మహేష్, అక్కినపెల్లి బలరామ్, నరాల శంకర్, రావిరాల కాశమ్మ, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

'చారుమతి'లో అన్నదానం

నల్లగొండ టూటౌన్ : ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా పానగల్‌లోని చారుమతి చైల్డ్ కేర్ ఆశ్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జునముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అన్నదాన వితరణ చేశారు. మైనం యుగంధర్, క్రాంతియాదవ్, శివ, రమేష్, సైదులు, ఆంజనేయులు, వెంకన్న, లింగస్వామి, శ్రీలత పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

నల్లగొండ రూరల్ : పట్టణ ప్రజలు దుమ్ముతో ఆరు నెలలుగా ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు పి గోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. వ్యాపారులు, వాహనదారులు, దుమ్ముతో అస్వస్థతకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు.


తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలి

నల్లగొండ టూటౌన్ : వేసవి సమీపిస్తున్నందున పట్టణంలో తాగు నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వీ. రమణాచారి ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తాగు నీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రిజర్వాయర్ల కెపాసిటీ ఆధారంగా పట్టణంలోని 48 వార్డుల్లోని కాలనీలకు రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఒక వ్యక్తికి రోజుకు 135 లీటర్ల నీటికి అందించాల్సి ఉండగా రెండు రోజులకు 270 లీటర్లు ఇస్తున్నట్లు తెలిపారు. నీరు సరఫరా కాని ప్రాంతాలు, కొత్తగా వెలిసిన కాలనీలకు నీటిని అందించాలని సూచించారు. చేతి పంపులను వెంటనే రిపేరు చేయాలని, నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఈఈ రాములు, డీఈ వెంకన్న, ఏఈ దిలీప్, ఫిట్టర్లు, ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?

శాలిగౌరారం : ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నిస్తే పాలకులు దాడులకు పాల్పడతారా అని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై బీఆర్ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడిచేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం రాత్రి ఫోన్‌లో 'సాక్షి'తో ఆయన మాట్లాడారు.

స్టెల్లాకు డీఈఓ అభినందన



స్టెల్లాను అభినందిస్తున్న డీఈఓ భిక్షపతి

మర్రిగూడ : ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ ఆంగ్ల భాషలో రాష్ట్రస్థాయిలో రాణించడం గర్వించదగ్గ విషయమని, ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో రాణించాలని డీఈఓ భిక్షపతి ఆకాంక్షించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం ఎస్‌సీఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ విజార్డ్ స్టోరీ టెల్లింగ్ ఆంగ్ల భాషా రాష్ట్ర స్థాయి పోటీల్లో మర్రిగూడ మండల కేంద్రంలోని 9వ తరగతి చదువుతున్న గంటెల విక్టోరియా స్టెల్లా గెలుపొందింది. ఈ సందర్భంగా గురువారం నల్లగొండ డీఈఓ కార్యాలయంలో డీఈఓ భిక్షపతి విద్యార్థిని స్టెల్లాను అభినందించారు. స్టెల్లా మరిన్ని విజయాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్టా జిల్లా అధ్యక్షుడు ఎండీ.అబ్బాస్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె.బాలరాజు, కోశాధికారి అల్వాల రాధాకిషన్, నూనె విష్ణు, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కె.భిక్షమయ్య, గైడ్ టీచర్ టి.మంజుశ్రీ, పీఈటీ వాసుదేవరావులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

నాంపల్లి : వారసత్వంగా వచ్చిన భూములపై కోర్టు నుంచి తమకు అనుకూలంగా జడ్జిమెంట్ వచ్చిందని, అయితే స్థానిక తహసీల్దార్ తమకు కొత్త పాసు పుస్తకాలు అందించి, కొంతకాలం తర్వాత అందులోనుంచి కొంత భూమిని ఇతరుల పేరుపై మార్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేవరకు నిరసన వ్యక్తం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు బెగరి అలివేలు, విజయ్‌కుమార్, చిన్న నర్సింహ, రాంబాబు తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



మునుగోడు : కస్తూరిబా పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



నాంపల్లి : కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు,ఉపాధ్యాయులు

మునుగోడు : మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థులు గురువారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పలువురు విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా, మండల అధికారులుగా, ఎంపీ, ఎమ్మెల్యే, ఎంపీపీ, సర్పంచ్‌లుగా వ్యవహరించి పాఠశాలను తనిఖీ చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి జేజ సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాంపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గురువారావు, ఎస్ఓ విజయశ్రీ, ఉపాధ్యాయులు జ్యోతి తదితరులు ఉన్నారు.